శ్రీ

# ఆంధ్రలక్ష్మి.

[illegible]

శా॥ శ్రీ రమ్యంబగు నాంధ్రదేశమహిళా శ్రేణీకనోద్భాసమై
నాకీలోక మనోగతాంధ తమసా జ్ఞానార్క సుజ్ఞానమై
ధీరోదార వివేకముఖ్య సుగుణా ధేయంబునై యొప్పు సొం
పారన్ వర్ధిలి "ఆంధ్రలక్ష్మి" యనుచీ ఆచంద్ర తారార్కమున్


| | | |
|---|---|---|
| సంపుటము 3. | బరంపురం, గంజాంజిల్లా.<br>పుష్యము - జనేవరి 23. | సంచిక 2. |


## ప్రార్థనము.

ఉ॥ ప్రాకృతజన్మ మిచ్చితివి * బుద్ధితో సంగతి, సంతతంబునూ
చేయగ, నీకు వారెను, వ * సించి, యథావిధిజీవయాత్ర చే
తూరిచి, యింద్రియమ్ముల * గోచరమయ్యెద, వట్టిమాకుఁ బో
కాదిచి, నిన్నుఁ గాంచఁగల * జ్ఞానమొసంగుము; లోకనాయకా.

చ॥ ఎటుగనుఁగొన్న నీవిభవ * మేర్పడకన్నులఁ గట్టెగాని, ని
న్నొకటఁ బరికింతమన్నను, న * తీంద్రియగోచరరూపమౌని, యం
తక్కటుమగుమాయయందెరల * గ్రమ్మగఁ జేసితి; వానిఁ ద్రోసి వి
స్పుటముగ, నీస్వరూపమును * జూపుము ప్రేమ లోకనాయకా

# బాలనీతికథ

పూర్వకాలమున దశరథునికుమారుండగు శ్రీరాముఁడు మనదేశమును బాలించుచుండెను. ఆతనిరాజధాని అయోధ్య. యువరాజు తమ్ముఁడగు లక్ష్మణుఁడు. ఆతఁడు దేవతలయందుఁ గూడఁ గానరాని సకల సుగుణములనుగలిగి దుష్టసంహారము శిష్టరక్షణముఁ గావించుచుఁ బ్రజానురంజకుఁడై న్యాయ మావంతయుఁదప్పక రాజ్యపాలన మొనరించుచుండెను. ఆకాలమున నొకనాఁడు లక్ష్మణుఁడు మొగసాలకేతెంచి ప్రజలంగాంచి "రాములవారితో మనవిచేసుకొనవలసిన విషయములుగలవా?" యని ప్రశ్నించెను. మనవులేమియు లేవనియు, దర్శనసౌఖ్య మనుభవించుటకుమాత్రమే వచ్చితిమనియు నందఱు నేకగ్రీవముగ నుత్తరమిచ్చిరి. ఆమాటలాలించుచున్న శునక మొకటిమాత్రము శిరమునుండి రక్తధారలుగార మొఱఁబెట్టుచుండెను. లక్ష్మణుఁడు దానియొద్దకేగి "ఏల నీనడిశిరముఁగారె నిచట మొఱసేయుటకు హేతువేమి?" అనియడిగెను. అందులకది తనమనవి సగతిలకు తెల్ల గతియగు రాముని యెదుట నేగాని యితరుల యెదుట విన్నవించదనియె. ఆమాట కాతఁడు గినుక రామునియొద్ద కేగి విన్నవించెను. రాముండును దానిం దోడితెమ్మనియెను. సౌమిత్రియు మరల దానియొద్ద కేగి "రాజుగారు నిన్నుం దోడి తెమ్మనిరి. రమ్ము" అని పిలువ నది గజగజవడఁకుచు "యతులు బ్రాహ్మణోత్తములు మొదలగు పుణ్యపురుషులుగల పేరోలగంబునకు నేను రాఁజెల్లునా!" యనన దానిం దనయన్నతో విన్నవింప నాతండు

దయాళుండై యచ్చోటికి విచ్చేసి దానిం గాంచి "యేల వచ్చితి వని యడుగగా నది కన్నీరు విడిచి యిట్లనియెను. "మహాప్రభూ! నీవట్టి న్యాయాధికారుండ వీ నెచ్చట గానను. ఎందఱో మహానుభావులు సభలో నిండియుండ వారల నెల్ల నుంచి హీనజాతిజాతనగు నాకు న్యాయ మొసంగ నేతెంచిన నీ దయాగుణంబు నేనేమని వినుతింపం గలను. వారిధిం గట్టిన వానరుల కన్న నధికముగ నుడుతను లాలించితివి. పక్షిని సంస్కరించితివి. కోఁతులయెడఁ బ్రీతిఁ జూపితివి. శబరి యొసంగిన పండ్లు భక్షించితివి. దొడ్డ కొంచము తెంచక నిన్నాశ్రయించు వారి నెల్లఁ బక్షపాతరహితముగ నాదరించెదవనియే నీ యొద్ద కేతెంచితిని. ఎవ్వరికి నపకారము నొనరింపక సంచరించు నన్ను నేడొక సన్యాసి బెట్టుగాఁ గొట్టెను. తలపగిలి రక్తధారలు గారుచున్నవి. పరామర్శింపు" మన రాముం డా భిక్షుకునిం బిల్వఁ బంచి "మహాత్మా! నీవు బ్రాహ్మణుండవయ్యు నంతశ్శత్రువగు దురాగ్రహమును గెలువలేకపోతివి. ఈ కౌలేయకము నీ కేమి యొగ్గొనరించెను? ఏల కఱ్ఱముతోఁ దలఁ బగులఁ గొట్టితి" వన నాతండు కేలుమోడ్చి "రామా! నేను భిక్షార్థమింటింటఁ దిరిగితిరిగి యలసి వచ్చుచుండ నప్పుడియ్యది దారి కడ్డముగ నిలచి కదలకున్నఁ గొట్టితిని. తప్పుఁ జేసితిని. దండనార్హుఁడను. దండింపుము. నీవు దండించిన యమదండన లేకపోవును." అనెను. "రామచంద్రా! ఈ బ్రాహ్మణుని కాలాంజన పర్వతముపైఁగల దేవాలయ పాలకునిగా నియమింపుము: అదియే

పిలిచి దగ్గఱకుఁ దీసి" యన శ్యామసేనుఁ రాముని మందహాస
కలితుఁ జేసి పరివారము వీడుకొని తనకాలము తద్దేవాలయాధిపత్యం
బున కెదురు చేసి భద్రగడంబునైకొక్కండు పలికిన నాశ్చ
ర్య బుద్ధి మంత్రు లానతీయ్య సంగతిని సభాసదులు సాశ్చర్యభావమా!
ద్రోహ మొనరించిన బ్రాహ్మణునకు దండనముగా దుర్గాధిపత్య
మొసంగితివని విన్న బ్రాహ్మణులందఱు నిట్టిద్రోహ మొనరిం
చుటకు వేచియుందురా?" అనిరి. అంతకులకాంతం జూపని మం
చిదో చెడ్డదో దైవాజ్ఞయే చెప్పఁగలదని గుక్కురం బిట్లని
చెను. అయ్యలారా! దేవబ్రాహ్మణ ధనాపహరణ మహాపా
పమును దావానలము వంశమును వెనుకవివి గాల్పక మానదు
గాన నకార్యమే ందే యకూడదు. గతజన్మంబున నేనొక
బ్రాహ్మణుడను. దేవాలయాధిపతిగానుండి తద్ద్రోహంబున నీజ
న్మంబునఁ గుక్కగాఁ బుట్టితిని, ఆ పారుపత్యంబున సాధుసేవయు
దీనపోషణమును గావించితి నందుచే నీజన్మంబున జాతిస్మరణ
కలిగినది. అని శునకము రామునకుఁ బ్రదక్షిణమొనరించి శల
వుఁగొని కాశికేగి యట నిరశనవ్రతంబునఁ బ్రాణంబులంబాసి
దివికేగెను. తక్కినవారందఱును దేవబ్రాహ్మణులకు ద్రోహ
మొనరించిన నెట్టిపాపము ప్రాప్తించునో గ్రహింపఁగలిగిరి,
బాలబాలికలారా! ఈకథవలనఁ దెలియు నీతు లనేకములు
గలవు.

—— :0: ——

# సతీహితము.

ఇందిర:— ఏదియో యొక పాపపూరిత జీవి యున్నయెడల తక్కినవానినెల్ల నట్లె తలంపవలయునా ?

సుగుణ:— ఇందిరా ! అటుగాదు ఈభూతలంబునందీ కలియుగంబున ప్రేమతత్వముకంటె కామతత్వమే యెక్కుడగుటచే కామాశ్రయులు కాంతాకనకంబులనే ప్రేమపూరిత సుతాది బాంధవులకంటె నెక్కుడుగ తలంచి యధఃపతితులగుచున్నారు. చూడుము మాయింటికి సమీపంబుననే ధనుంజయరావను వ్యాపారివంతులు గలరు. ఆతనికిది ద్వితీయవివాహము. ప్రథమసంతతి కిద్దరాడుపిల్లలును నొక మగచిన్నవాడును గలరు. తన సోదరిచెంతనుం బసిపిల్లల నిద్దఱనుబంపి పదేండ్ల బాలికనుమాత్రము బాలిసత్వమున కింటి ముందు నిల్పుకొని ఇప్పటిభార్యకు సేవకురాలిక్రియ వర్తింపఁజేయుచు నంతటితో తృప్తినందక తన ప్రేయసి యాబాలపై కల్పించి చెప్పు మాటలనమ్మి మర్దించుచుండును. ఇందులకు కారణమేమియో తెల్పుము ! కామాంధతయేగదా! తొలిభార్యయే యుండిన ఆపంతులాపిల్లల నటుల బాధింపఁగలఁడా ? ప్రత్యక్షమానశకులని యక్కునఁజేర్చి ముద్దిడుకొనఁడా ! చెల్లీ! ఈకలియుగమంతయు కామాంధత కాస్థానమై, ధనతృష్ణల కాలవాలమై, క్రోధ, మద మాత్సర్యాది దుర్గుణసంఘముల కాటపట్టయి, తనవంక క్రేగంటఁజూచినవారినైన నాకర్షించి యధఃపథంబునకీడ్చి చేతి కీలుబొమ్మలతెఱంగున నాడించి జననమరణప్రవాహంబున కాహుతమొనర్చి

యంతములేని జన్మసంద్రమునం గూలందోయు స్త్రీ మాయగా పరిప్లుతమైయున్నది. నెచ్చెలీ! ఈ భూతలంబున మనకెవరో శత్రువులుగలరని తలంతుముగాని, వారిని నిజభావంబునం జూచిన శత్రుత్వమేమియులేదు. మన అంతరంగముననుండు జ్ఞానదృష్టిచేం బరిశీలించిన క్రోధదేవతాకృత్యమని కనుంగొనవచ్చును. ఇట్లే పరస్పరముగ మానవులకేర్పడువిరోధములెల్ల నా దుర్గుణసముదాయపుచర్యలే యని భావించి వానినిం దూర ముట్టింపం జాలక జీవులెల్ల మృతజీవులలెక్కంగున నాభూతముల హస్తగతంబై, జ్ఞానాలవాలమై, మోక్షసాధనము సీ మానవజీవితము నధోగతింజెందం జేసికొనుచున్నారు. సోదరీ! ఈ దుర్గుణప్రపంచమెల్ల ఆశకుమూలస్థానమని నమ్ముము. నే నిప్పుడొక చీరం జూచితినను కొనుము. వెంటనే నా యంతరంగమున "నాకా చీరయుండిన బాగుండు" ననుభావ ముద్భవిల్లెను.

చూచితివా! ఈభావమే తృష్ణాదేవికృత్యమని తెలిసికొనుము. ఆతృష్ణాదేవి పాశంబునం జిక్కుకొనక 'ఛీ బాగులే' దని-ఆచీరనుకామం. చీర రూపకభావమును మఱలించిన శ్రేయము. లేనిచో నది కావలయునని కోరిక బయలువెడలును. ఎట్లు వచ్చును? ఒకరి నడుగవలెను. వారిచెంత ధనము లేకపోయినను, లేక వారికది నచ్చకపోయినను, లేక వారు నిరాకరించినను దుఃఖము. అందువలన క్రోధము. దానతిరస్కారము. పైన అవినయము. పిరినమునంచి దూషణ. ఇన్నిటికి లోనము

కొందఱు మాత్రము కష్టకాలమున నాతృష్ణాదేవి మాయావాగు రమునఁబడి వెలువడుచు దుర్బలులగుకొందఱు ఆశాపాశంబులఁ జిక్కి అతిహేయమైన నీచమైనట్టి చోరకృత్యంబులకు నుపక్రమించి లబ్ధమనోరథులై అపరిమిత దుఃఖవార్ధిని మునుఁగుచుఁ దేలుచునుందురు. తొలుదొల్త నద్దానిఁ బరిష్కరించిన నెంత శ్రేయమో గుర్తించితివా! ఆశాపాశబంధనములేదు. అపరిమితదుఃఖములేదు. ఇందిరా! స్త్రీ ధనమును ఆశాదేవి మానవుని ఆకర్షించును. అధనముకై యాతఁ డెట్టిఘోరకృత్యంబులనైనఁజేయ సమకట్టును. ఎంతటి సహజ హితుల ప్రాణంబులనైన బోఁగొన నపేక్షించును: కన్నతల్లులనైన అమ్మఁజూపియో లేక చంపిన నపరిమితధనరాశి చేకూరుననెడి నమ్మకమున్న వాడు హత్యసేయుటకైన వెనుదీయని మనోధైర్యమునొసంగి ప్రోత్సాహపఱచును. జనకుని హత్యకైనను, భూదేవి సదృశమగు జననీమారణమునకైనను ఏకగర్భజనితులగు సోదరులఁజంపనెంచుటకైనను వేయేల స్వనాశనమునకైనను వెనుకంజవేయనీయక పురిగొల్పుచునే యుండును. దుర్గమ పర్వతాగ్రంబుల నెక్కించును. నదుల నీదించును. సముద్రముల దాటించును.

సోదరీ! ఈతృష్ణాదేవికి జన్మస్థానము స్వార్థపరత్వము. పట్టుఁగొమ్మ భోగపరత్వము ఊతకఱ్ఱ మదాంధత. ఇట్టి ఆశాకాంతకాధీనమై యార్జించిన యన్యాయార్జనమెల్ల స్థిరమనుకొనుచున్నావా! దానివలె మత్తుఁగలుగఁజేయు పదార్థమేదియు

గును. విషము. అయ్యదికూడచాలదు. విషమొక్కరినేచంపును. చంచలమగు ధన మనేకుల నంతమొనర్చును. చంచలయగు ధనకాంతకు వర్ణానామత జాతిభేదములులేవు. బహుభర్తృక కావున వ్యభిచారిణి. వ్యభిచారిణిమాత్రమేగాదు. కులటులలో బహు కులట. ఎందరినో ఆకాశ హర్మ్యంబుల నెక్కించును. అకారణంబుగ అంతలో అమాంతముగఁ గూలఁద్రోయును. ఇస్సిరోఁల పిల్లలాడు బొమ్మలాటఁబోలె జీవులనొక నాటకమాడించి ఆవలఁద్రోసి యంతర్ధానమగును. ఇట్టి దుర్గుణభూయిష్ఠములగు తృష్ణాధనంబుల నెవ్వఁడాసించునో వాఁడంతరించును. ఎవఁడు నిరసించునో వాఁడె విజ్ఞానమయుఁడు. వాఁడె సార్థకజీవుఁడు. వాఁడె మహానుభావుఁడు. వాఁడె ఆనందమయుడు వాని నేభూతములు జయింపఁజాలవు. వానిని సాక్షాత్పరబ్రహ్మస్వరూపుడనియే తలంచవచ్చును. ఇందిరా! ఈ కనకంబుకంటె కలుషమైనది కామినీకామాంధత. తిలోత్తమయను దేవదాసికై సుందోపసుందులనుసోదరులు అత్యంతప్రేమచే నొండొరులను ప్రేమించుకొనిన ఏకగర్భజనితులు గంధర్వనాయకులు మహానుభావులు పోరాడుకొని యిరువురును మడిసిరి.

ఇందిర:— సుగుణా! నీవు చెప్పినదెల్ల నిజమేకాని మన స్త్రీజాతిని మనమే నిందించుకొనుట సిగ్గుచేటుకాదా.

(సశేషము)

# సుమతి.

———:0:———

అధిష్ఠాన పురంబను నొకపురంబు గలదు. అప్పురంబున గౌశికుండను భూసురుఁ డొకఁడు కలఁడు. అతఁడు బాల్యమునుండియు, దుష్ప్రవర్తనకలవాఁడై వేశ్యాంగనాలోలుండై ప్రవర్తింపుచుండెను. అతనికి సుమతియను భార్యకలదు. ఆమెసద్గుణంబుల నెన్నుటకు సహస్రాక్షునికైనను నలవికాదు. భర్తయెంతతన్ను దూషింపుచున్నను, నెట్టిదుష్టకృత్యముల నాచరింపుచున్న నొక్కింతయైనను విసుగుకొనక, భర్తను మించిన దైవములేదనితలంచి యతనికి సపర్యాపరిచర్యలఁ జేయుచుఁ బూజింపుచుండెను. ఒకదినమున వేశ్యాభుజంగుఁడగు నాభూసురుండు పణ్యకాంతగృహంబునకరుగుచు భార్యను పిండివంటకములుఁజేసి వేశ్యాగృహమునకుఁ దెమ్మని యాజ్ఞాపించెను. సుమతియు భర్తయాజ్ఞను మీఱఁదాల్చి యానాటిరేయి భక్ష్యంబులఁజేసి, వేశ్యాగృహంబున నున్న పతికిఁ దీసికొనిపోయెను. దుశ్శీలుండగు నాభర్త సతింగాంచి తక్కువభక్ష్యంబులఁ దెచ్చితివని దండించినను, నోర్చుకొని, యొక్కింతయైనను చింతింపక నింటికిమఱలి వచ్చుచుండెను. ఆసమయంబున నొక్కసర్పము దారికడ్డము వచ్చెను.

అప్పుడుసుమతి యాపాముపాతనైనఁబడి ప్రాణములవాసి సుఖింతమని తలంచి దానికెదురుగఁ జనెను. కాని యాసర్పరాజంబు సుమతింజూచి ధర్మదేవతా స్వరూపంబు ధరించి యామెపాతివ్రత్యమునకు మెచ్చుకొని భగవద్ధ్యాన తత్పరమతివై యుండుమని చెప్పి శాశ్వతానంద పదవినందు మార్గము బోధించెను.

లంచగొండికి న్యాయమందుఁదలపును, వేశ్యకునిజమైన వలపును, కాకిజాతియందుఁదెలుపును నుండుటకల్ల. కౌశికుండు ధనమున్నంతవఱకును వేశ్యలతో జరించెను. తుదకాతఁడు తినుటకుఁగూడును గట్టుకొనుటకు వస్త్రంబును లేనివాఁడై చరింపవలసి వచ్చెను.

అతఁడొనర్చిన వ్యయముచేతనే యట్టిదురవస్థ బొందితినని విచారించి పశ్చాత్తాపము నందక నాకుమతి సుమతింజూచి యిట్లుపలికెను ‹‹గర్భనిర్భాగ్యురాలవగునీవు నాకుభార్యవయితివి. ఇంటికరుదెంచిన వారికెల్ల భో

జనంబులు వెట్టి నా యిల్లంతయు గుల్లఁ జేసితివి. నాకు దరిద్రము వచ్చుటకు నీవే కారణమైతివి. ఇంక నేను గృహమునందున్న ప్రయోజనము లేదు. ఎచ్చటికైనఁ బోయి బిచ్చమెత్తుకొనియైన జీవించెద నీవింటనుండుము" ఈ పలుకులు విని సుమతి "ప్రాణేశ్వరా! మిమ్మును విడిచియుందునా! పతి యెక్కడనున్న సతియు నక్కడనే యుండవలయును గదా! మీరు భిక్షాటనఁ జేయుచుఁ గష్టములఁ గాంచుచుండ నేనింటనుందునా? అట్లుండునని యెన్నఁడును దలంపకుఁడు. మీరింటనుండుఁడు. నేను యాచించి తెచ్చి మీకుఁ బెట్టెదను" సహజకోప స్వభావుండగు నా కౌశికుఁడామె వాక్యములకు లోఁబడని యొక రాత్రిసమయంబునఁ జెప్పకుండ నెటకో పోయెను. మఱునాఁ డుదయంబున సుమతి తనభర్తను గానక యరిగినందులకు మిగులఁ జింతించుచు నాతని నన్వేషించుచు బయలుదేరెను. అట్లు సతిం బాసి యరిగిన కౌశికుండు చోరులకుఁ జిక్కి వారిబలవంతమున చౌర్యవృత్తిని బూనఁదలంచి వారితో వచ్చుచుండెను. ఆసమయంబున నతనికై వెదకుచు వచ్చుచున్న సుమతి ప్రాణేశ్వరుఁ గాంచి భక్తిమై నమస్కరించి చోరులను బ్రార్థించి యాతని విడిపించి "నాథా! నన్నిట్లు విడబాసి పోవుట ధర్మముఁ గాదు జరిగినదేదో జరిగినది. గృహంబునకు బోవుదము" అని పలుక నా కోపస్వభావుం డామెను గొట్టి, తిట్టి చెట్టునకుఁ గట్టి తనదారినిఁ దాఁ బోయెను. ఎట్లో మరల నక్కడ జరించు నెఱుకులవలన నామె కట్లు విప్పఁబడి పతిం గలసికొనెను. భార్యాభర్తలిరువురు నొక బ్రాహ్మణ యగ్రహారంబునఁ జేరుకొని యొక బ్రాహ్మణుని గృహమున విడిసి భిక్షచేఁ గాలంబు గడుపుచుండిరి. కౌశికుండు రోగగ్రస్తుండై లేవలేక యుండెను. ఇట్టిస్థితిలోనికి వచ్చినను నా భూసురునికి బుద్ధి రాలేదు. అతఁ డొకనాఁడు సుమతిం గాంచి "తరుణీ! నీవు నాయందెంతో భక్తిఁ గలదానవు. నా కొక కోరిక యున్నది. అయ్యది తీర్చెదవేని నిరంతరము నీ చెప్పిన చొప్పునఁ బ్రవర్తించెదను. ఈ నగరంబునకు చిట్టచివరవీధిలో నొక వేశ్యా గృహమున్నది. అయ్యది నన్నుఁ గూడునట్లుఁ జేసితివేని నా ప్రాణంబులు నిలుచునని పలికెను. సుమతి నాథునికోర్కెఁ దీర్చుటకు వేశ్యాగృహంబునకరిగి యామెను తన

మృదుమధుర భాషణంబులచే వశముఁ జేసికొని, పతికోరికఁ దీర్చు నట్లంగీకరింపఁ జేసెను. అంతసుమతి యింటికివచ్చి యా సంగతి నాథునకెఱింగించి రాత్రి యైనంతనె పతిని నొకగంపయందుం బెట్టుకొని వేశ్యయింటికరిగెను.
వేశ్యయు నాతనిరూపుంజూచి రోయుచు నెట్టకేలకు నాతనికోరికం దీర్చెను. తరువాత నా సాధ్వీమణి యగు సుమతి తననాథుని మరలగంపయందుం బెట్టుకొని గృహంబునకు మరలి వచ్చుచుండ దారిగనబడక పోవుటచే కొఱతయం దున్న మాండవ్యుఁడను మునిపాదమున కాగంప తగిలెను.

ఆ మునీశ్వరుం డా సుమతిం గాంచి కోపారుణితనేత్రుండై కన్నులు గనిపించుటలేదా? యని పలికి సూర్యోదయంబైనంతనే నీభర్త మరణించుగాక" యని శాపం బిచ్చెను. అంతనా సుమతి శాపంబునకు దద్దయుఁ జింతించి మునీంద్రుం గాంచి "దేవా! పొరపాటున జరిగినదానికి మీరాగ్రహము వహించి యిట్టి శాప మొసంగితిరి కావున నేనె పతిభక్తిగలదాననైతినేని సూర్యోదయము కాకుండుఁగాక" యనిపలికెను. మాండవ్యుని శాపంబునకు గౌశికుండు భయమందుచుండెను. సుమతి యాతనికి ధైర్యముఁ జెప్పుచుండెను. కౌశికుం డప్పుడు తానుజేసిన దుష్కృత్యములకును భార్యమెలతఁ జూపి యగౌరవంబునకును బశ్చాత్తాప మొందెను.
సుమతి శాపంబు ననుసరించి యెనిమిది దివసంబుల వఱకును సూర్యోదయము కాలేదు. సమస్తలోకములును నాకులమందుచుండెను. త్రిమూర్తులరుదెంచి సుమతిం గాంచి శాపంబు గ్రమ్మరింపుమని కోరిరి. అప్పుడామె వారింజూచి "త్రిమూర్తులారా! నాపురాకృత పుణ్యవశంబున మీదర్శన భాగ్యంబు లభించినది. మీరు నన్ను శాపంబు ద్రిప్పుమని కోరుచుంటిరి. నేను శాపంబు ద్రిప్పితినేని నాపతి గతించును. పతిలేని జీవనంబేల. కావున మాండవ్యుండు తనశాపంబుఁ ద్రిప్పెనేని నాశాపంబును నేను మఱలించెదను" అనిపలికెను. త్రిమూర్తులామెను మాండవ్యుని దగ్గిరకుఁ దోడ్కొనిపోయి శాపంబు మరల్పుమని కోరిరి. సుమతిం గాంచి మాండవ్యుఁడు "దీర్ఘసుమంగలి వగుదువుగాక" అని యాశీర్వదించెను. సూర్యోదయంబగుగాక యని సుమతి నుడివెను.

సూర్యోదయంబయ్యె లోకంబులన్నియు సంతసించెను. త్రిమూర్తు లామెకు ననేకవరంబు లిచ్చి చనిరి కౌశికుండు తనభార్యమహిమ కచ్చెరువం ది నాటినుండియు సత్ప్రవర్తకుండై భార్యను గూడియుండెను.

తే॥ గీ॥ తిట్టినను, గొట్టినంబతియె * దిక్కు సతికి.
భర్తదుర్మార్గుఁడైనను * భావమందు
పతిని దైవంబుగ దలంచు * నతివ, యిమ్ముల
యశము నార్జించి, వెలుఁగొందు * నవనియందు.

వేముల చంద్రమతి

## గృహిణీవిచారణ.

సీ॥ అక్క! మనమందఱముఁ బుట్టి * నట్టిదినము
మొదలుగా, నేఁటివఱకు నొక్క * మూర్తమైన
జోడుబాయక, యొక్కచోఁ * గూడి, యాట
లాడుకొనుచును, బాటలఁ * బాడుకొనుచుఁ
జిన్నసెలయేటఁ స్నానంబుఁ * జేసి భక్తి
పరిసరోపవనమ్మున * విరులఁగోసి
యచట వెలసినసర్వేశ్వ * రాలయమున
కేగి, దేవునిఁబూజించి * యిచ్చవచ్చి
నట్టులాడుచు, నింటికి * నరుగుదెంచి
చలువ వస్త్రములనుగట్టి * సత్వరమున
పాఠశాలకుఁ బోవుచు * వచ్చుచు నతి
మోదమునఁ గాలమునువ్యర్థఁ * బుచ్చితిమిగ!

అయ్యయో! ననకిటువంటి * వన్నెయింక
స్వప్నసదృశంబులౌఁగదే * సారసాక్షి
నేఁటివారంబునుండియు * నిందుపేర్మి
తోడననుఁగౌఁగిలించి ము * ద్దాడుమమ్మ!

# సుభాషితరత్నావళి.

౩౭ సంసారసౌఖ్యానందము క్షణభంగురము సుమా సుమా

౩౮ స్థిరబుద్ధిని సిద్ధేశ్వరునర్చించిన అర్చక మాతృస్తన్యపానామృత వత్

౩౯ స్వబలంబువిడనాడి పరబలంబునుబట్టుకొని ప్రాపలాడుట పురుషునివిడనాడి పరపురుని గోరు పరకీయావత్ సుమా

౪౦ ధనబలాన్వితులు భామినీలోలురైన గోతిలోబడ్డహస్తివత్ సుమా

౪౧ మనసులేని కామినిపొత్తు లేబచ్చి కాయపండవేసిన చందంబున పరిణమించును సుమా

౪౨ అంగబల గర్వంబున నన్యులతో కలహంబులాడు వానిబ్రతుకు చలిచీమలకు జిక్కిన సర్పవత్ సుమా

౪౩ పరస్త్రీసఖ్యంబు పాలుబోసినపాము చందంబుసుమా

౪౪ అనాలోచితకార్య ఫలంబు అకాలవృష్టి వత్ సుమా

౪౫ సజ్జనాలోచనలు శరదృతు శశివత్ సుమా

౪౬ దుర్జనాలోచనలు గ్రీష్మఋతురవి వత్ సుమా

౪౭ దుస్సంఘము అగ్నివత్ సుమా

౪౮ సత్సంఘము శ్రీచందనవత్ సుమా

౪౯ గురుశిష్యత్వంబు భ్రమరకీటకవత్ సుమా

౫౦ అనభిమానాదరణ అనావృష్టివత్ సు

(సశేషం)

# జీవబోధ. (ప్రథమ సోపానము)

## *Initial steps to 'Jíva Bodha.'*

1. మూలాధారు నెఱుంగని జీవుఁడు ముక్తికాంత నెఱుంగదని తెలిసికొనుమా జీవమా.

Know thou Ego ( Jiva ) those that cannot realise the fountain-head of Creation cannot reach the presiding Deity of Salvation.

2. మూలాధారుని కటాక్షంబుఁ బడయలేని జీవుఁడు ముక్తిని బడయలేఁడని యెఱుంగుమా జీవమా

Whosoever cannot obtain the grace of the root cause cannot attain Salvation.

3 సగుణంబెఱుంగలేని జీవుఁడు నిర్గుణంబెఱుంగలేఁడని తెలిసికొనుమా జీవమా

Without knowing the manifested spirit one cannot know the unmanifested.

4 సగుణంబెఱుంగనిది నిర్గుణంబెఱుంగలేవే జీవమా

Whosoever cannot realise the personal God cannot realise the Impersonal.

5. సత్కర్మాచరిత్వ మైనఁ గాని నిష్కామకర్మ మెట్లు కుదురువే జీవమా.

Without practising good actions how can thou succeed in doing actions without attachment.

6. జాతికిఁ బనిలేదని నీతినియమంబుల నిరసించక మెలఁగుమా జీవమా.

Though thou ignorest thy status by birth do not discard moral excellence.

7. బాహ్య వేషంబుల విడనాడి బాహ్యాంతర వ్యాపిని బడయుటకుఁ గృషిసల్పుమా జీవమా.

Mind not external embellishments but realise the Omnipresent

8. కులాచార ధర్మములఁ గూర్మి నాదరింపుము జీవమా.

Carry out the racial and customory duties with care

# సరళ.

—:o—

## రెండవప్రకరణము.

అజాయజాలోచన లోచనంబులఁ దెఱచెను. మరల మూసెను శిరోభాగమున కేదియో మెత్తగ సోఁకినట్లాయెను. మరల మెల్లఁగ గన్నులఁ దెఱచిచూడ తానొక సుందరియంకతలంబున శిరముంచుకొని పండుకొనియుండినట్లు తెలిసికొని, సిగ్గుపెంపునో, లేక స్వజన సమక్షమున విచారము ద్విగుణము సటచేసెనో, మరల లోచనద్వయంబును మెల్లనమూసికొనెను. కాని యొక్క నిముసంబుననే తటాలున లేచి యా నూతనయువతి వదనంబునఁ జూపులనిలిపి అత్యాతురమున "నళినీ! నళినీ!! దుఃఖించుచుంటివా !!! యనెను.

నళిని:— లేదు. కాని సోదరీ! నేను దుఃఖించుచుంటినని నీ వెట్లు నిశ్చయించితివి?

సరళ:— నీ వేడి కన్నీటిబిందువొకటి నా నుదుటిపైఁబడి నీవిచారంబుఁ దెల్పెను.

నళిని:— చెల్లీ! నాసోదరి నికృష్టదశఁ గనులారఁ గాంచుచు, సహాయమొనర్ప నశక్తనగుట నొక్క భాష్పకణంబు విడిచినైనను తృప్తిఁ గొందఁ దలఁచితి ఆహా! సర్వేశ్వరా.! నీ దయాము నునాకు నెంత యసార్థకమాయెను !!!

సరళ:— సోదరీ! నాయట్టి నికృష్టజీవికై దయామయుఁడగు నాపరమేశునిఁ దూఱనేల? స్వకర్మార్జిత సంచిత మూఱకపోవు

నా! "అవశ్యమనుభోక్తవ్యం కృతంకర్మ శుభాశుభం" అను నార్యోక్తి నెఱుంగవా!

నళిని:— ఎఱుంగకేమి గాని సోదరీ! సకల సద్గుణావతంసమునకు, వినయ వివేకాది సుశీలకు, విద్యావిశారదకు, బాల్యంబుననే యిట్టి కఠినశిక్ష నా కగఁ గారణమయుండగు జగజ్జనకుఁ డెట్లో నరిగెనో! యనువిచారము నన్నువేధించ తనంతటనై యుబికి కన్నీరు ప్రవహించెను. చూడుమా! కుంతలంబు లెట్టుల ధూళి ధూసరితమై చెదరి చిక్కుపడియున్నవో! నిత్యముండెడి యీ బాధలకిట్లాఱడివై కఠినశిలామయంబగు ధాత్రీతలంబునఁబన్నుండి నీ సుకుమార తనులత నేల శోషిల్లఁజేసెదవు. అనిపలుకుచు- కరంబులచే ధూళినితొలగించి కుటిలకుంతల సముదాయంబును జక్కఁజేసి మేనునంటి నలిగియున్న ప్రసూనంబులఁగాంచి "ఇది యేమి! ఈపూమొగ్గలన్నిఁటిని నేల పాలుగావించిన దెవరు?" అనెను.

సరళ:— మాతృదేవత పువ్వులఁ దెచ్చియిచ్చుటయందించుక యాలస్యమగుటను నాగ్రహచిత్తయై న న్నీకొరడములఁ బూజించినది.

నళిని:— ఏమీ! మాతృదేవతయే!! అట్లనుటకన్న నామెను శత్రుదేవత యనఁజెల్లు. ఇందులకే యిట్లుగావింపవలెనా?

సరళ:— అట్టివెన్నియైన భరింపఁగలనుగాని సోదరీ! వీనికన్న నధికమగు నాపదయొకటి నన్నలముకొనుచున్నది.

నళిని:— అనుంగు నెచ్చెలీ! అదేమి క్రొత్తగ వల్కుచుంటివి? నిన్నటివఱకిట్టిదేమియుఁ దెలియఁబల్కితివిగావే!

సరళ:— సోదరీ! నా దీనావస్థ నేమని పేర్కొందును. దరిలేని భయంకర సాగరమధ్యంబునఁబడి కొట్టుకొనుచు అనుకూలపవన ప్రాప్తియను నావచే నీభూతలయాత్ర సౌఖ్యవంతముగఁ గొనసాగించుకొను నవకాశ మొక్కటి యున్నదిగదా యను నాశాపాశబంధితనై యింతవఱకీదోషపూరితాన్యతా సూయాదోషణావాక్యంబులకు నాస్థాననై, నిత్యము ప్రహారణంబులకీ నిర్భాగ్యశరీర మప్పగించి సకలబాధల సహించుచుంటిని గాని దిక్కుమాలిన నాయాశావల్లిక నేఁటితో విచ్ఛేదమైనది. సాగర మధ్యంబున ఝంఝామారుతసంరంభ సమయమున మునుంగునావక్రియ నాజీవనౌక సంసారసాగరమధ్యంబున హతాశాసంరంభంబున మునుగనై యున్నది. మఱియు నేమియో బల్కబోయి గద్గదికస్వనయై అశ్రుధారా ప్రవాహ మాపఁజాలక వెక్కి వెక్కి యేడ్చుచు నెచ్చెలిభుజంబున వదనమూనెను.

నళిని:— సరళా! నీ కట్టియుపద్రవస్థితి యేమి యొనఁగూడినదో యెఱిగింపకయే దుఃఖించెదవేల? నెచ్చెలినగు నాకెఱిగింపక నీవొక్కరితవే తత్ఫలం బనుభవించిన స్నేహభావ మసార్థకంబగునుఁజుమీ! శోక ముపసంహరించుకొని విచార విశేషంబులఁదెల్పుము. నీవిచార మపనయింప నశక్తనియు, నల్పజ్ఞనియు నేనెఱుంగుదును. నీకణుమాత్రమేని సహాయ మొ

ర్పఁజాలని నిష్ప్రయోజన జీవనని యెఱుంగుదును. కాని నీవిచారాంశమునందలి భాగ భోగ్యము నాశించి నిన్ననుకరించుటకే గాన తెల్పుము. నిష్ప్రయోజన దుఃఖమేల ?

సరళ:— నెచ్చెలి స్కంధభాగంబున చింతవలన నానుకొని యుండిన వదనపద్మ మల్లనెత్తి నళినీ! నాకై నిన్నేల నట్లు దూషించుకొనెదవు, నాదురదృష్టమే యీ విచార కారణము. నాదీనావస్థఁ దెల్పి నిన్నుఁగూడ నేల విచారనిమగ్నను గా నొనర్పవలెనని సందేహించుచున్నాను. కాని ఒకవేళ నే నెఱింగించకపోయినను నచిర కాలంబున నీవే వినంగలవు.

నళిని:— సరళా! నీదుఃఖము నాదుఃఖము గాదా! నీమనోభావమును నాచెంత మఱుఁగుపఱచెదవా? నీమనోక్లేశ మొక్కింత నాకెఱింగించిన నీహృదయభార మించుక శాంతిల్లును గాదా! నెచ్చెలీ! దయచేసి తెల్పుము.

సరళ:— నళినీ! నాజనని నన్నొక్క జరా పీడితున కొసంగి యుద్వాహం బొనర్ప నిదివఱకే ప్రయత్నించుచున్నది. కాని నిశ్చయ మెఱుఁగక యేల విచారింప వలెనని యుంటిని. కాని ఆయమ నేఁడొనర్చిన ఘోరప్రతిజ్ఞతో నా యనుమాన నివృత్తియైనది. అదియునుఁ గాక యట్లొనర్చినఁగాని యామెకీలోకమున నొక్కింతయైన సౌఖ్యము లేదట: సోదరీ! చిత్తమానత్య స్వరూప్రతియందుదీనంబుచేసి శారీరక క్లేశముల నెట్లైన సహింపుమంటి నిగాని అజన్మాంతానుభావ్యమగు నీ చిత్త ప్రతికూల వైవా

హృత్క్షోభ నెటుల భరింపఁ గలను. మనోబాధలెల్ల నశ్రుకణ రూపంబునఁ బయలు వెడలి నిగనిగలాడు నా బాల చెక్కిళులఁ జేరి సంతత ధారగా ప్రవహించు చుండెను.

నళిని:— సరళా! నీ వీ ఘోర విపదాంబుధిం దాటుటెట్లు? కట్టా! ఈ కఠినాత్మురాలి వాక్యంబులే, క్రియలగును. సందియము లేల. ఓ సర్వసాక్షివగు నిందిరారమణా! అన్ని విధముల నిందిరనే బోలఁగల ఈ సద్గుణ పుంజము నొక వృద్ధాగ్నిహోత్రున కాహుతిఁ జేయఁదలంచితివా!! ఈ విద్యాఖని నొక మూర్ఖాగ్రేసరున కిల్లాలుగఁ గూర్పఁదలంచితివా!!! ఈ సౌందర్య విరాజిత నొక కురూపునకు నాలుగ నిశ్చయించితివా! సకలబాధల శాంతి యుతయై సహించుచు, బానిసకన్న వేయిమడుంగులధికముగఁ బనులొనర్చుచు వినయ విధేయినియై సరిబాంధవుల సంస్తవనీయమగు సతీశిరోమణియై విలసిల్లు నీ యింతుల మేలుబంతి నొక ముసలిపిశాచమున కంటఁగట్టఁదలఁచితివా! అమాయకురాలగు నీపుత్రికపైని నింతయక్కటికం బేలబూనితివి తండ్రీ! ఎట్లయిన నీవీ మహాబంధమునుండి తప్పించి రక్షింపుము తండ్రీ!! సరళా! లెమ్ము మంటివేలనమ్మా!!

సరళ:— ఇంకను నా పనులు ముగియలేదు. ఈతడు లతలను నీరుఁ బోయవలెనని మెల్లమెల్లగ నచటి కనతి దూరంబునఁ బాలగమ్ముచే తయారయిన పళ్లెముగల నూతిచెంతకరుగఁజొచ్చెను. ఆయువతి వెనువెంటనే నళినికూడ నరిగి గమ్యస్థానము కొంక

యడుగుముందునకైచి యట నున్నజలమును దోడుబిందెను నూతిలోనైచి నీరుఁదోడుచుండెను. నళిని సుందరాకారమున నించుకయైన సరళకుందీసిపోదు. కాని యించుకపొడగరి. సార్థకనామధేయయై, సద్గుణపూరితయై, స్నేహవాత్సల్యరూపిణియై చెలికి సాయమొనర్చుచుండెను. నళినీసరళలు సమవయస్కలు చిన్నటనాఁటనుండియు నీబాలికలిరువురు నత్యంత స్నేహమున నేకహృదయలై, విద్యానిధులై యుండిరి. నళిని విద్యానాథుఁడను నొక న్యాయసత్త్వముని యేకపుత్రిక. ఆ సుగుణుఁడు సార్థక నాముఁడై తనకుమారికనపరభారతిగా నొనర్చె. ఈవిద్యామతల్లి సఖ్యంబున సరళయు సద్గ్రంథములఁ దన నెచ్చెలి చదువనాకర్ణించియు, తనయంతఁ దాఁజదివియు, తెలియనివానిఁ దెలిసికొనియు విద్యయందు నళినితోఁ దులదూగుచుండెను. ఈమెకొక సోదరుఁడుఁగలఁడు. అతఁడుగూడ సుగుణావతంసుఁడై సత్పురుషాగ్రగణ్యుఁడై ప్రతివత్సరము పరీక్షలయందు ప్రథమతరగతిలో గెలుపొందుచు బహుమానంబుల నందుచుండెను. కేసరిగర్భంబున జంబుక ముద్భవించునా? ఆసుమానుండు కలకత్తా విశ్వవిద్యాలయమునఁ బట్టపరీక్ష (బి.ఏ;) నిచ్చి యిపుడేవచ్చి యుండెను. అతఁడును నళినీసరళలును చిన్ననాఁటగోలె సుహృద్భావంబున నేకగర్భ జనితులవగిది చరించుచుండిరి. వీరలస్నేహమునకు భంగ పాటురానీయక సరళ మారటతల్లి యొకింత కరుణ వహించినది.

(సశేషము)

# జనార్దనుఁడు.

(వెనుకటి తరువాయి.)

జ:— వారి యుద్దేశ్యములకు మీ యభిప్రాయములకును మీరు మధ్య వచ్చుచుందురు గదా?

పా:— ఓయమ్మ నీకిప్పుడు వారివలె నేదో యుద్యోగము కావలయునా?

జ:— నాకెన్నఁడును అట్టిదౌర్భాగ్యదశ తటస్థింపఁజేయవలదని దేవునికి వేయినమస్కారములొనర్చెదను. అట్టిపదవికై యాశించి నా స్వేచ్ఛానుభోగము ద్రుంచుకొని సేవకావృత్తి నవలంబించ నెందురా? మదోన్మత్తత ద్రోహము అసత్యము మున్నగు గుణము లెవ్వియు నాకడలేవు కాన నేనట్టి పదవికిఁదగను.

పా:— అట్టిచో నీవేమి యాశించి నాదర్శనమునకరుదెంచితివి?

జ:— నేను దక్షిణదేశమున కొన్ని వత్సరములు పర్యటనము సల్పి యచటి భూపతుల నెల్ల దర్శించితిని. వారి సింహాసనములు సాధారణముగ సభామధ్యమున నవి రెండుమూఁడడుగు లెత్తుగనున్నవి. వారందరికిని నధిపతులైన మిమ్ముల దర్శింపనెంచి, యిటువచ్చితిని. మీ యాసనము నట్టి యవస్థ యందే యున్నది. కావున మీయం దట్టి విశేషము లేదని యిప్పటికి దెలిసికొంటిని. దూరపు కొండలు నునుపు రాను రాను గలుగు అనునట్లు సమ్ముఖమునకు వచ్చినగాని యదార్థము గ్రాహ్యము కాదుగదా!

పా:— నీవూహించినట్లు వారును నేనును మనుష్యమాత్రులమే. కాని వారికిని నాకును నొక భేదము మాత్రము కలదు. రాజరాజును కావున నందరికంటె నాకెక్కు డధికారమును, ధనమును గలదు. విశేషించి నేను హిందూదేశమునకెల్ల సార్వభౌముఁడనను మాట నీవుఁ దెలియవా?

జ:— అట్టులయిన మీరు వారికంటె నెక్కుడు వివేకహీనులనుటయందసత్యముండదు. ఏలన "పరుసంబు కలిమి దొరతన మరయమి" యనునట్టివి, మనుజాన కనర్థమునగూర్చుచుండును. ఇట్టి వన్నియును మీయందు కలవు. కావున మీమనసెప్పుడును, సత్కార్యములయెడ్ల సానుభూతి నొనరఁజేయదు.

పా:— నాధనము దుష్కార్యములకై వినియోగింపఁబడుచున్నదా?

జ:— అందున సందేహమా! యీ సభాస్థలము నలంకరించిన గ్రామము లెల్ల

మిమ్ముల ననుసరించి యున్నంతవరకును, అట్లే జరుగుచుండును

ఆమాటలకు పాదుషా పకపక నవ్వి "నీ సమాచారమంతయును నాకు చాల నవ్వు పుట్టించుచున్న దనెను."

జః— విశేషముగ, నవ్వు మూర్ఖుని నోట నుండియే బయలు వెడలును. అందు నిట్టి కొల్వుకూటమున నవ్వుట మిక్కిలి తప్పు

ఇంతవరకును, వినోదముగ సరస సల్లాపములు సల్పుచుండిన, పాదుషా యాతని వాక్యముల కించుక ఖేద మొంది దండతాడిత భుజంగమువోలె నుద్రేకించి, జనార్దనుని విలోకించి "ఛీ! మూర్ఖా! పరువు మర్యాద తెలియని నీవంటి మూఢుని నాసభాస్థలికి రానిచ్చినందులకు తగిన శాస్తి జేసితి" వనెను.

జనార్దనుఁడు పాదుషా కోపానలమునకు పాత్రుఁడైనను, ఇంచుకయేని భీతిల్లక, నెప్పటివలెనే "నన్నేమందురు! చిన్ననాట నుండియు నా స్వభావమిట్లే పరిణమించుచున్నది. కావున మీరందులకు ఖేద మొందకు" డనెను. పాదుషా కోపకషాయితాత్ముఁడై పొరలివచ్చు కోపమున "మూర్ఖా, అవలకుఁబొమ్ము, నీకీ మూఢబుద్ధి మారునంతవరకును నానగరమున నడుగిడవలదు. ఇదియే నా యాజ్ఞ" అనెను.

జ.— చిత్తము. ఏలినవారి యాజ్ఞ శిరసావహించెదను. కాని ఒక చిన్న మనవి చేసుకొనుచున్నాడను. నే నొక ఈఁగవంటి వాఁడను, దానిని తోలిన కొలఁదిని, మఱింత మీదవ్రాలుటకుఁ బ్రయత్నించుచుండును.

పా:— సరే కానిమ్ము, నీవు నా యాగ్రహమునకు పాత్రుఁడైతివి. ఇప్పటికి నిన్ను క్షమించితిని నీవు నా నగరమున నేటినుండియు నొక క్షణమైన నుండుటకు వీలులేదు నిన్నిప్పుడు సురక్షితముగ పంపివేసెదను. కాని నీవన్నటుల మరల్ల కొలఁది కాలములోనే, ఈఁగలతో నిటు రానియెడ నీకు శిరచ్ఛేదము గావింపవలసివచ్చును ఇందుకు నీవు సమ్మతింపక తప్పదు

జ:— అట్లే కానిండు. మీ యాజ్ఞ ప్రకారము మీ మరల విమ్ముల నీఁగలతో దర్శింపవచ్చెదను. అటుతప్పితినేని శిక్షయొనర్చుఁడని దర్బారును విడచి యావలకుఁబోయెను.

(సశేషము)

# ఉషాపరిణయము.

## ప్రథమాంకము.

### అంతఃపురము - ఉషాప్రవేశము.

ఉష:—(దద్దరిల్లుచు నిద్దురనుండి లేచి) ఏడీ! నామానధన మపహరించిన దొంగ ఏడీ!! అని కలవరించుచు మేల్కాంచి (తనలో) ఆహా! అసమాన రూపరేఖా విలాస భాసురుండగు రాకుమారుండు నన్నతుల రతుల నలయించి సొలయించి సౌఖ్యాంబుధి నోలలాడించి నా మానధనమెల్లఁగొల్లఁగొని మాయమయ్యె. ఇది కలయా? నిక్కమమా? నిజమనుకొందమన్న నేను సౌధోపరి వేదికాస్థలమ్మున హంసతూలికా తల్పంబున నిద్రించితిని. బంధించిన కవాటంబులు బంధించినటులనే యున్నవి. తెఱచిన జాడయైనఁ గానరాదు. నా యంతిపురి కొక పోతుటీఁగయైనఁ జొరఁ శక్యముగాని కాపుగడ కలదు. నా జనకుని యాజ్ఞ నతిక్రమించుటకుఁ జతుర్దశ భువన వాసులు కలవి గారు. అట్టిచో నొక్క రాకుమారుండెక్కడనుండి నిక్కడకు రాఁగలండు. ఒకవేళ నాయందలి మోహాతిరేకంబున నేయుపాయముననో రాఁగలిగినచో నాతండు నన్నెత్తికొనిపోయియుండును గాని దొంగవలె నిటులు మటుమాయమగునా? ఇది కలయే యనుకొందమన్న నామనోహరాకారుని విగ్రహము నకట్టెదుటఁ గట్టినటులఁగానవచ్చుచున్నదే! ఆ సుకుమారశరీరుని వినీల

దేహకాంతులు, ఆ సువిలాసోన్నతవక్షుని పద్మపత్త్రాయతలోచన ధావళ్యప్రభలు, ఆ మందహాస కందళితవదనారవిందుని నర్మాలాపమాధుర్యగుణములు, ఆనవమన్మథాకారుని రత్నకిరీటకుండల కటకాంగదాద్యలంకార ఝణంఝణాధ్వనులు, ఆ కస్తూరీతిలకుని వీటీసౌరభము నా పంచేంద్రియమ్ములంగలంచి విరహాంబుధి మ్ముంచి వేయుచున్నది. దంత నఖక్షత చుంబనాద్యనంగ సంగర చిహ్నంబులు అచ్చున గుద్దినట్లు ముద్రితంబులై నా దేహంబునంగానవచ్చుచున్నవి. ఏమిచేయుదు! నెట్లు తాళుదు! నా మనం బఱియనెంచి యెందైనఁ బొంచి యున్నాడేమో! వెదకి చూచెద.

క॥ శుక శారికలారా యో
పికదంపతులార చిత్ర • పింఛములారా
మకరాంకుఁబోలు రాసుతుఁ
డొకఁడిట నేమూలదాగెనో • యెఱుఁగుదురే.

గీ॥ మదమరాళములార నా • మానధనముఁ
జూఱలాడినదొంగనుఁ • జూచినారె
చెప్పఁగదరమ్మ నాకొప్పఁ • జెప్పరమ్మ
పట్టితేరమ్మ నన్నుఁగా • పాడరమ్మ.

ఎవ్వారును జూపరు. ఎచ్చటను గానరాడు. ఇది కలయేమై యుండునేమో. ఏమైననేమి. అంతకంతకు కంతు

సంతాపము దురంతమగుచున్నది. చెలులెఱింగినఁ గేలి సేయుదురు. జనకునకుఁదెలిసినఁ బ్రాణహానివాటిల్లును. ఏమి సేయుదును. ఎటులఁదాళగలను. హా! నాథా! మనోహరా! కారా! ఒక్కసారి దర్శన మొసంగుము. కౌఁగిలిమ్ము. తాపంబాపుము. తాళఁజాల. ఇదె నమస్కరించుచున్నాను. (మూర్ఛిల్లుచున్నది.)

చిత్ర:- ఉషా! ఉషా! ప్రియసఖీ! ఏమియాశ్చర్యము. ఈబాయీనేల నేల శయనించినది. ఎన్నఁడు నిట్టిగాఢనిద్ర నెఱుంగదు. దగ్గరకుఁ బోయి మేల్కొల్పెద. (చేతితో తట్టి) చెలీ! ఉషా! లెమ్ము లెమ్ము ఏమీ పలుకకున్నది [ఆలోచించి] నిదురకాదు. మూర్ఛిల్లినది. [శైత్యోపచారంబులుచేసి, బిగ్గరగా] చెలీ! లెమ్ము లెమ్ము.

ఉష:- [దిగ్గునలేచి చిత్రలేఖను కౌఁగిలించుకొని] దొంగా! దొరికితివి. చిత్తచోరా! ఇఁక నెందుఁబోఁగలవు. (కనులు తెరచి సిగ్గు నభినయించుచున్నది)

చిత్ర:- ఉషా! నేను దొంగనుకాను. నీచెలినగు చిత్రలేఖను. చిత్తచోరా! యనిపలవరించితివి. నీచిత్తచోరుఁడెవఁడు.

ఉష:- [తనలో] ఇపు డేమనిచెప్పి తప్పించుకొందును. చెప్పిన నగుబాటుగదా! [ప్రకాశముగా] చెలీ! ఏమియులేదు.

చిత్ర:- చెలీ! తెలిసినది 'వజ్రం వజ్రేన భిద్యతే' యను నటుల స్త్రీల హృదయము స్త్రీలకే తెలియును.

నన్నేల మోసపుచ్చెదవు.

ఉష:- చెలీ! చిత్రలేఖా! అనంగతి నటించదనిమ్ము. ఉద్యాన వనమ్మునకుఁ బోవుదము రమ్ము.

చిత్ర:- నెచ్చెలీ! ఉషా! ఏల నన్ను వేరొకప్రసంగమునకు మరలించెదవు. నేఁడేలఁ జింతాక్రాంతురాలవై యున్నదానవు. నే నెఱుఁగునంతవఱకు నిన్నింతగా నలజడిపెట్టు విషయము లెవ్వియును లేవు. నీ దీనవదనముఁ జూడ నా కేమియుఁ దోచకున్నది. నిక్కము వచింపుము.

ఉష:- [కంటనీరుఁబెట్టదుఃఖించుచు నూరకుండును]

చిత్ర:- ప్రాణసఖ! అతి మనోహరమై అత్యంత ప్రకాశమానమై చూచువారికి నేత్రానందముగా నుండు నీ సుకుమార సుందర శరీరము నేఁడెంతగా శోషిల్లి కాంతివిహీనమై కానవచ్చుచున్నదో నిలువుటద్దమునఁ జూచుకొమ్ము. నేను నీ బహిఃప్రాణము నని యెఱుఁగవా! దాచక చెప్పుము.

క॥ వనజాయతాక్షి! యొక చ
క్కనిప్రియుఁ డెడబాయ వానిఁ • గన్గొన చేజా
రిన మణికై వెదకుచు నుం
డిన జాడలు వ్యక్తమాయె • నీవిధముఁ గనన్

ఉష॥ చెలియా! నేను పరాధీన నటవే • చింతింపఁగా నేల నీ
తెలుపరఁబుం బరికింప నొక్కప్రియునిం • జేజార్చుకొన్నట్టుగా

తెలియన్వచ్చెఁగదమ్మ దాపరిక మే । లే తెల్పవే చింతిలన్
వలదమ్మా భవదీయ వాంఛిత మెదో । వాక్యమ్ము నేఁ దీర్చెదన్

జంఝూటి రాగము — ఏక తాళము.

చెలీ! చెలీ! చెలీ! - నీ చింత యేమిటో
విలంబమేల ఁదెల్పుమమ్మ - వేగమె నాతో ॥చెలీ॥
నిన్నుఁజూడఁగా నొక - వన్నెకాని పైఁ
గన్ను వైచి వెదకుచున్న - వన్నె తోఁచెనే ॥చెలీ॥
బాలికామణీ! నీ - ప్రక్కఁ బాసిన
మేలువాని వెదకుచున్న - లీల తోఁచెనే ॥చెలీ॥
వన్నెలాడిరో నా - కన్న నెక్కువై
యున్నవారు కలరటే నీ - కిన్నఁడైననూ ॥చెలీ॥
చెప్పుమూరహిన్ నీవు - చెప్పకున్నచోఁ
దప్పక నీ యుప్పతోడు - కప్పురగంధీ ॥చెలీ॥

ఉషః — చెలీ! నిక్కముగ నీవు నా బహిః ప్రాణమవే! ఇంక
నీయొద్ద దాపరికమేల? నా హృదయ రహస్యమును జెల్ల
డించెదను వినుము.

మ॥ కలికీ! చక్రియొక్క రాసుతుఁడు నా । కన్యాత్వముం బాపెనన్
వలపించెన్వయసెల్లఁ జూఱగొనె నా । వ్యామోహ మెచ్చంగ నా మహో
జ్జ్వలతేజుఁడు వినీలదేహుఁడు సదా । హాసుం డుదారుండు ని
శ్చలచిత్తుం డెటకేగినాడొ తెలియన్ । శక్యంబు గాకున్న దే

గీ॥ ఊరుఁబేరును దెలియని * యొక్క రాచ
పట్టి నను నిద్రలోఁజెట్ట * బట్టి పోయెఁ
గని విని యెఱుంగనెన్నండు * కాంత వాని
నెటులఁగన్గొందు ప్రాణంబు * లెటుల నిల్చు

క॥ కలయో నిక్కమొ యది
తెలియంగారాదు వాని • దెచ్చి ప్రాణముల్
నిలువంబెట్టుము, తప్పిన
వలరాయనిబారికోర్వ • వశమగునె చెలీ!

బేహాగ్ రాగము : అటతాళము

కలికిరో! నే నొక్క కలఁగని। కలఁతనొందుచు నుంటినే
తెలుప సిగ్గులచేటు నున్నది। దేవమాయయొకో సఖి ॥కలికి॥
ప్రారసాక్షిరో! శూరుఁడున్ సుకు। మారదేహుఁడు ధీరుఁడున్
మారునిన్మఱపించురాచ కు। మారుఁడొక్కఁడువచ్చెనే ॥కలికి॥
నన్ను కౌఁగిటఁజేర్చి ముద్దిడి। యెన్నొవిధముల వేడుచున్
నన్నుతాంగిరో! మోహిగ్రోలుచు। సమరతులఁ దేలించెనే ॥కలికి॥
ఇంత సౌఖ్యసుధాబ్ది నను దే। లించి యేమొకొ ద్రొంగయై
అంతలో నెటుబోయెనో యీ। చింత నేనెటు లోర్తునే ॥కలికి॥

చిత్ర:- చెలీ! నీవనుభవించినది కలయా? నిక్కమా? యని సందేహించు చున్న దానవు. అయ్యది కలయు నిక్కమును రెండును నగును. నిన్ను కలలోఁగలయువాఁడె నీకు విభుఁడగునని ఆనాడు పార్వతి నీ కిచ్చిన వరమును

మఱచితివా? మొట్ట మొదట నతఁ డెవఁ డో తెలి
కొనవలయును.

క॥ చెలి పదునాలుగు లోక
ములలోఁగల పురుషవరుల • బుద్ధిబలమునన్
కలమున జిత్రించెద నీ
చెలువుని జూపింపుమంచు • జెచ్చెరఁ దెత్తున్

మ॥ సారసాక్షిరో! చింతయేటికి • సర్వలోక నివాసులన్
రూపులన్ పటమందు వ్రాసి యుఁ • జూపెదన్ సఖి! పోల్పవే
చోరుఁడీత డటంచు దెల్పిన • చో దటాఁకున నాతనిన్
నేరయుంబునఁ దెచ్చి యిచ్చెద • నీకు నమ్ముము కోమలీ

ఉష:- క॥ కోమల్మీ! పదునాలుగు భువ
నమ్ముల పురుషాళిపటము • నాకడ కిపుడే
తెమ్మా నాప్రియుఁగన్గొన
నిమ్మా ప్రాణములు మేన • నిల్వవు సుమ్మా

చిత్ర:- మంచిది క్షణము ఓర్పుకొని యుండుము. ఇపుడే పోయి
వచ్చెదను [ నిష్క్రమించును ]

ఉష:- ఒంటరిగాఁ గూర్చుండి [ తనలో ] ప్రాణేశ్వరా!

చ॥ ననుఁగలలోన ముద్దిడి మ • నంబలరారఁగ గౌఁగలింపుచున్
వనితరో! నిన్ను నెప్పుడెడ • బాయ నటంచును బాసఁ జేసి యం
త నె మటుమాయమైతివి మ • నంబున నించుక జాలిలేదె హో
మనసిజకోటిరూప సుగు • మారశరీర ధరా పురంధరా!

ఉ॥ అరమరలేనికూర్మి నను • సంగజ సంగర కేళిఁ దేల్చునో
నిరుపమరూప యో విరచ • నీరజపత్ర విశాలనేత్ర యీ
ధర నిను బొందనేని యిక • త్రాణ జలాగ్నులో చంద్రహాసమో
గరళమొ కో శరణ్యమగుఁ • గాని మనం బొరుఁ జేర నేర్చునే!

ఆహా! పరమేశ్వరా! నాకేమిగతి. నా మనోనాథుఁడగు
మనోహరాకారునిఁ గనుఁగొను భాగ్యమే లేదు కాఁబోలు.
నేను బేలనై కలలోఁ గాంచిన వరునకై మరులుఁగొంటిని.
ఆ మానినీ మనోహరుఁడు నాకు లభించునో లభింపఁడో
లభింపకున్న నీ మేనఁ బ్రాణములు నిల్చుటెట్లు ......
ఓ దివ్య మంగళ విగ్రహా! ఓ నవ మన్మథాకారా!
ఏల నన్ను మోసగించెదవు. నీ కేమి యపకారించితిని.
దాఁగిలి మూఁతలేల. రమ్ము దర్శన భాగ్య మిమ్ము.

చిత్రి:— [ప్రవేశించి] చెలీ! ఇదిగో చిత్రపటమ్ములు.

క॥ చెలి వీర లూర్ధ్వభువన
మ్ములఁగల బ్రహ్మేంద్రచంద్ర • ముఖదివిజులు, వీ
రలు క్రిందిలోకవాసులు
ఇలఁగల నృపవరులు వీరె • యిందు నిభాస్యా

క॥ కౌరవపాండవ యాదవ
వీరులు వీరలనుజూడు • వీరలలో న
శూరవరుండౌ కృష్ణుఁడు
మాకుం దాతనినుతుండు • మధుకరవేణీ

బేహాగ్రాగము : ఏకతాళము.

చూడుమో చెలి స్వర్గలోక । సురవరాళిని
వీఁడో వాఁడో తెల్పుమా నీ । విభుడటంచనీ ॥చూ॥
రవివంశమలంకరించు । రాజులు వీరే
భువి శశికులమణులు లోక । పూజ్యులు వీరె ॥చూ॥
అకలంకచరిత్రులు దే । వాంశ సంభవుల్
నకులార్జున భీమ ధర్మ । నందనాదులన్ ॥చూ॥
యాదవకుల జలధిచంద్రులు । సోదరీమణీ !
మాధవ ప్రద్యుమ్నముఖులు । మధుకరవేణీ ॥చూ॥

ఉష:- (ప్రద్యుమ్నుని పటము బట్టుకొని

గీ॥ చంచలాక్షిరో ! నన్ను వం • చించిచనిన
సుందరాంగునిరూపంబె • చూడ నితఁడు
వయసుమీరినవాడు నా • వాఁడుకాఁడు.
సుదతిరో ! చూపుమా వీని • సుతుని పటము.

(ఇచ్చివేయును.)

చిత్ర:- అనిరుద్ధుని పటము చేతి కందిచ్చును.

ఉష:- (ఆపటమును చేతఁబట్టుకొని సంతోషముతో తనలో)
ఇతఁడే. నిశ్చయముగా నితఁడే. నిన్నటిరేయి నాకలలో
గన్పడినరూపమునకు నీ చిత్తరువునందలి రూపమునకు
నావంతయు భేదములేదు, (ప్రకాశముగా)

ఆ॥ వె॥ పీడె వేడెనన్ను * పీడని వేడుక
పీడమూరగించి * జోడుగూడి
పీడుకోలుగొనక * పీడెనే మనపీడు
పీడె సంధియమ్ము * పీడుగొనుము,

అనుచు తన మెడలోని ముత్యాలహార మామె మెడలో వైచి

దేశీయతోడిరాగము : రూపకతాళము.

ఎంతని నే మెచ్చుకొందునే । ప్రాణసఖి । నిన్నెంత నినే మెచ్చుకొం
ఇంతలు నీ చర్యలహహా । వే నోళ్ల నుతింపఁదరమె ॥ఎం॥ [దునే
ఇంతిరో ! నా మానధన । మంత కొల్ల గొన్న హాని । వంతమున
లిఖించిన నీ యంతిటి పుణ్యాత్మురాలి ॥ఎంతని నే॥
పీనికులము బలముదెల్పి । వేగమెకోడు కొనివచ్చి । చానరో
ప్రాణములను నా । మేన నిల్పి రేలు కొనవె ॥ఎం॥

చిత్ర:- ఇప్పటికి నేను కృతార్థురాల నైతిని.

ఉష:- చెలీ ! వీని కులశీలాదులం దెల్పుము

చిత్ర:- ఆ॥ వె॥ కలికి ! యితఁడు ద్వారక * కా నాథుఁడౌ కృష్ణ
పుత్రుఁడౌ రతీశు * ముద్దుపట్టి
సింహ విక్రముఁడు * శ్రితజనార్తిహరుండు
యాదవాన్వయుండు * హానినముండు

దర్బారురాగము : రూపకతాళము.

బాలికామణీ! -వినవె- బాలికామణీ

బాలరో ! వినుమితఁడు । । పద్యుమ్నుని ముద్దుపట్టి ॥ బాల॥

యాదవకులచంద్రుండు । అనిరుద్ధుండనెడివాఁడు
శ్రీకృష్ణునిమనుమఁడు సుమా । సింహపరాక్రముఁడు
సోదరి యతనికి సముఁడును । చూడఁబోము ముజ్జగముల
వాదంబున గెల్వు నెల్ల । వారలబలరూపములను ॥చా॥

ఉష:- నెచ్చెలీ! అట్టియెన నేను ధన్యురాలను. కాని వాని సందర్శించుభాగ్యము నాకెట్లులభించును?

చిత్ర:- ప్రాణసఖీ! చింతింపకుము. ఈరాత్రి నా విద్యాప్రభావంబున ద్వారకాపురికింబోయి వానిందెచ్చి నీ సౌధాంతర మృదుతల్పంబునం జేర్చెద. అతండును నీ రూపలావణ్యాదులకుం జొక్కి నీచేఁజిక్కును.

ఉష:- చెలీ! అట్లొనర్చి నా ప్రాణమ్ముల నిలుపబెట్టుము పోయిరమ్ము.

చిత్ర:- నిష్క్రమించును.

తెరపడును.

# ఉషాపరిణయము.

## ద్వితీయాంకము.

### ఉద్యానవనము - ఉషాప్రవేశము.

ఉష:- హా! పరమేశ్వరా! నన్ను మోహగించిన వన్నెకాఁడీ యుపవనమ్మున దాఁగియుండునేమో వెదకుదమనియు, నిచటి వైచిత్ర్యముల నవలోకింపుచుండినఁ గొంత మనశ్శాంతియగుననియు వచ్చితిని. ప్రియుఁడా కానరాఁడు. పైన గూడ నా మనమును మరింత కలవరింపఁ జొచ్చినది. ఈవనమ్మును నా భవనమ్మును నాచింత నంతకంతకు మరంత మొనరింపుచున్నవి. ఏమి చేతును ఎందు జొత్తును. నా చెలివచ్చువఱకు నెటుల నోర్చుకొని యుందును. ఆమె యెప్పటికివచ్చునో! వచ్చినఁ బ్రాణేశ్వరుం దెచ్చునో! తేఁజాలక మరలివచ్చునో! యెవరెఱుంగుదురు. ఆమె నాయవస్థఁగని సాహసించినది గాని అతం డామెకుఁజిక్కునా? ద్వారకాపురాధీశ్వరుఁడు శ్రీకృష్ణుఁడు. ఆతండు దనుజాంతకుఁడు- ఈమె దనుజాంగన- ఆతండు తన మాయాజాలమ్మున నఖిలయాజాండ బ్రహ్మాండముల నాటాడించు కపటనాటక సూత్రధారి. నా చెలి విద్యలు, మాయలు, నాతనియొద్ద సాగునా? ఆ మహానుభావుని వంచించి వాని ముద్దులమనుమని నెత్తికొని వచ్చుట నా చెలికలవియగునా? కానేరదు, కానేరదు,

ఓం

# దివ్యౌషధము

నేలకొలది యోగ్యతాపత్రములు పొందిన

# శిలాజతురసాయనము

## ప్రతివారికిని ప్రాణసమానమైనది

అతి శ్రేష్ఠమైన గోమూత్ర శిలాజిత్తు (మోమ్యాయి) తో తయారుచేయబడును. దీనిని శిలాజిత్తు లేహ్యమని కూడ చెప్పుదురు. జీవించి యున్నందునను ఈరోగి ఆరోగి యనక ఏరోగిదైనను, ఎట్టి నిరోగిదైనను దీని నొకసారి తప్పక పుచ్చుకొని తీరవలయును. పాతరోగముల బారద్రోలుటయే గాక నూతనజాడ్యముల రానియ్యక కాపాడును. శరీరపుష్టి, శుక్రవృద్ధి, ఇంద్రియపటుత్వము, అధికబలము, మంచిఆరోగ్యము, అత్యద్భుతముగ కలుగజేయును. ఇంతయేల? జీవితాశగల(స్త్రీ), బాల, వయోవృద్ధులకు సహితము నన్ని విధముల ఆరోగ్యమునకు అమృతతుల్యమైయుండును. ఇంతియేయంతటను వేలకొలది డబ్బాలు ఖర్చయి ప్రఖ్యాతివడసినది. ప్రతిదినమును యోగ్యతాపత్రికలును విశేషముగ అర్డర్లును వచ్చి చేరుచున్నవి. పట్టణములు, పల్లెలోన సుకూడ మాకు ఏజంట్లు కావలెను. ఇంగ్లీషు కేటలాగులు కోరినవారికి నుచితముగ పంపబడును.

శిలాజతు రసాయనము 20 తు॥ డబ్బా 1కి రు 6-0-0

శ్రేష్ఠమైన శిలాజతు బజారు హెచ్చుతగ్గు ధరలను బట్టి ఈ రసాయనపు డబ్బాల ఖరీదుకూడను మారుచుండును.

చిరునామా

ఆయుర్వేద రత్న పండిత,

## బి శ్యామసుందరరావు బ్రదర్సు,

**ఆయుర్వేదౌషధాలయము, బరంపురం, (గంజాం)**

# కమల.

ఇది 'గోల్డుస్మిత్' అను ఆంగ్లేయకవిశ్రేష్ఠునిచే వ్రాయబడిన 'హెర్మిట్', అను దానిననుసరించి ముద్దులుమూటగట్టుచుండు శైలిలో రసవంతములగు గీతపద్యములతో వ్రాయఁబడినది. ఇందొక రాజపుత్రిక తాను మనసారఁ బ్రేమించుకొనిన నాథుని ధనమదాంధతచే నొకదట తనమనస్సును మారుచ్చుకొని వరింపకుండుటయుఁ, బిదప గొంతవడకి పశ్చాత్తాపమునొంది వానినే వరింప నతనికొరకై యడవిలో నష్టకష్టములఁబడి తుదకు ప్రేమించుటయుఁ జదివి తీరవలెను వెల రు 0-2-0 లు.

# శ్రీ వరలక్ష్మీ శతకము.

ఇది లక్ష్మీభక్తుల కత్యంతోపయుక్తమగు భక్తిరస ప్రధానమగు పద్యములచేనొప్పు నూతనశతకము. ఇంతియకాక నిందు నీతి మత సంసు విషయికములగు పద్యములుకూడఁగలవు. శైలిమృదుమధురము, వెల రు 0-2-0

# శ్రీ మహాలక్ష్మీ పూజపాటలు.

ఇందు శ్రీమతి కల్లేపల్లె వెంకట రమణమ్మగారిచే నప్పుడప్పుడు రచియింపబడి ప్రచురింపబడిన పూజపాటలు, మంగళహారతులు, క్రోడీకరించి ప్రకటింపబడినవి. వెల రు 0-2-0లు

# ఏకాంత సేవ కీర్తనలు.

ఇందు గౌరీశంకరుల యొక్కయు లక్ష్మీనారాయణుల యొక్కయు ప్రణయ కలహములు, తిరువీధి మొదలగు నుత్సవములయందు జరుపబడు సేవావిశేషములు సంవాదరూపముగా రచియింపబడిన కీర్తనలును తదితర క్షేత్ర కీర్తనలును గలవు వెల రు 0-2-0లు

# కాంచనమాల.

ఇదియొక చక్కని నాటకము. ఇందు ఔరంగజేబు పుత్రికయగు కాంచనమాలకును, మహారాష్ట్రవీరుడగు శివాజీకిని జరిగిన విచిత్రవివాహము. ఔరంగజేబు శివాజీలకు జరిగిన సంభాషణము, మహారాష్ట్ర మహమ్మదీయ యుద్ధము, శివాజి చెరనుండి తప్పించుకొనుట, మొదలగునంశములు పొత్తమును గొనవలయుఁజదివినఁగాని విసువబుద్ధిపుట్టనీయదు. వెల రు 0-8-0లు

- మా ఆంధ్రలక్ష్మి చందాదారులకును, పుస్తక భాండాగారములకును స. ము వెలకు పై గ్రంథము లివ్వబడును

ఆంధ్రలక్ష్మి కార్యాలయము, బరంపురము, గంజాంజిల్లా.

---

# ప్రకటన.

జీతముపైనగాని మంచికమీషను పద్ధతిని గాని ప్రతి జిల్లాయందును, చందాదారులను గూర్చి ఆంధ్రలక్ష్మి మాస పత్రికకు విశేషవ్యాప్తి యొనర్పగల నమ్మకమైనయేజంట్లు కావలెను. వివరములు వలయువారు వ్రాసి కనుగొనవలెను

మేనేజరు,
ఆంధ్రలక్ష్మి కార్యస్థానము,
కుదివివారివీధి బరంపురం, [గంజాంజిల్లా.]

---

# ఆంధ్రలక్ష్మి.

ఇది స్త్రీల యుపయోగార్థమై ప్రచురింపఁబడు మాస పత్రిక. ఇందు పూర్వసాధ్వీమణుల చరిత్రములు, విద్యావతులై పేరుఁ గాంచిననవీననారీమణుల చరిత్రములు, సుబోధకములగు చిన్నవవలలు, కథలు, నాటకములు, పాటలుమొదలగు స్త్రీల కుపయుక్తములగు పెక్కు విషయములు ప్రకటింపబడును. అవ్వి స్త్రీవిద్యాభిమానులగు పండితులవల్లను, విదుషీమణుల వల్లనున్ను వ్రాయఁబడుచుండును.

## చందా వివరములు.

| | |
|---|---|
| పోషకులకు సం॥రం॥ | రు 10—0—0లు |
| సహాయులకు | 5—0—0 |
| చందాదారులకు | 2—0—0 |
| విడిపత్రిక | 0—4—0 |

## ప్రకటన రేట్లు

| | | | |
|---|---|---|---|
| నెలకు నిండుపుటకు | రు 2-0-0 | సంవత్సరమునకు | 20-0-0 |
| పంక్తి 1కి | 0-2-0 | అనుమానములకు | 11-0-0 |

శ్రీమతి కళ్ళేపల్లె వెంకటరమణమ్మ
పత్రికాధిపురాలు, పరవివారివీధి, బరంపురం (గంజాంజిల్లా)

Printed and Published By K. Sivaramiah
At the Andhra Lakshmi Press, Berhampore Ganjam [Dt]

# 1923 ఫిబ్రవరి · 1923

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఆది ... | | 4 | 11 | 18 | 25 |
| సోమ ... | | 5 | 12 | 19 | 26 |
| మంగళ ... | | 6 | 13 | 20 | 27 |
| బుధ ... | | 7 | 14 | 21 | 28 |
| గురు ... | 1 | 8 | 15 | 22 | |
| శుక్ర ... | 2 | 9 | 16 | 23 | |
| శని ... | 3 | 10 | 17 | 24 | |